క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు, పెదకూరపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పగటి వేషగాళ్లు ఎవరో ప్రజలకు తెలుసు

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు

ముప్పాళ్ళ: పగటి వేషగాళ్లు ఎవరో ప్రజలకు తెలుసునని, సామాజిక సాధికార బస్సు యాత్ర గురించి విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ చావా రమేష్‌లు అన్నారు. ముప్పాళ్ళలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సత్తెనపల్లి టీడీపీ నాయకులు స్థాయి మరిచి విమర్శలు చేస్తున్నారనే సంగతి తెలుసుకుంటే మంచిదన్నారు. బీసీలను వంచించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని, అందుకు ఉదాహరణే నిమ్మకాయల రాజనారాయణకు చేసిన ద్రోహం అన్నారు. మీరు మోసం చేస్తే వైఎస్సార్‌సీపీ ఆదరించి గుంటూరు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని కట్టబెట్టిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గంజి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, ముప్పాళ్ళ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో ఆర్ఏడబ్ల్యూఈపీ ప్రోగ్రామ్‌లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు భూసార పరీక్షల విధానంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రైతులే వారి పొలంలో మట్టి నమూనాను సేకరించి, భూసార పరీక్షకు పంపడంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ నారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అక్షింతల కలశం ఊరేగింపు

వినుకొండ(నూజెండ్ల) : అయోధ్యలో జనవరిలో జరగనున్న శ్రీరామచంద్రుని దేవాలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని పవిత్ర అక్షింతలు దేశంలోని అన్ని ప్రాంతాల భక్తులకు అందేవిధంగా శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం శుక్రవారం వినుకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా పవిత్ర అక్షింతలతో కూడిన కలశాన్ని మంగళవాయిద్యాలతో ఊగిరేంపుగా శ్రీరాముని భజనలతో పట్టణంలోని రంగనాయకస్వామి దేవస్థానం నుంచి మెయిన్ బజారు, బోసుబొమ్మ సెంటర్, కోదండ రామాలయం, శివయ్య స్థూపం సెంటర్ మీదుగా కొత్తపేట శ్రీ పట్టాభి రామాలయంకు చేర్చడం జరిగింది. ఆ పవిత్ర అక్షింతలను వివిధ గ్రామాలు, పట్టణాల్లోని భక్తులకు ప్రతి ఇంటికి స్వామి వారి ఆశీస్సులు అందాలని పంపడం జరుగుతుందని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, హిందూ బంధువులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు జె.రాజేశ్వరి, కె. సుబ్బారావు, ఎం. కృష్ణాంజనేయులు, గట్టుపల్లి కాశీ, గజవల్లి నాగపవన్, మల్లికార్జున, జి. బాలరావు, ప్రకాష్, నాగాచారి, ప్రసాద్, భద్రయ్య, సుబ్బారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు జిరాక్స్ మిషన్‌ను వితరణగా శుక్రవారం అందజేశారు. 1998–99 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు రూ.40 వేల విలువ చేసే జిరాక్స్ మిషన్‌ను మేడికొండ ఆంజనేయులు చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషా, ఉపాధ్యాయులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

దాచేపల్లి : పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం అర్ధరాత్రి నడికుడి మార్కెట్ యార్డు సమీపంలో జరిగింది. సుమారు 52 సంవత్సరాల వయస్సున్న యాచకుడిగా పోలీసులు గుర్తించారు. ఎస్ఐ డి.శివనాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాచకుడు దాచేపల్లి పరిసర ప్రాంతాల్లో కాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఒక ప్రమాదంలో కాలు తీవ్రంగా గాయపడింది. గురువారం రాత్రి ఓ పెట్రోల్ బంకులో పెట్రోలు కొనుగోలు చేసి మద్యం మత్తులో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఎస్ఐ శివనాగరాజు ఘటన స్థలంలో మృతదేహం పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నిరుపేదలకు మేలు జగనన్నతోనే సాధ్యం



చల్లగుండ్లలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే పుస్తకాలు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ రాఘవరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

అచ్చంపేట: నిరుపేద, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మేలు జరగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రయ్య అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో గురువారం రాత్రి ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంటింటికి తిరిగి అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజల వద్దకు పరిపాలన వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాసరావు, తమ్మా ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే సీఎం కావాలన్నది ప్రజల కోరిక

ఫొటోరైటప్

నకరికల్లు: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలన్నా, అవినీతి లేని సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా ఆంధ్రప్రదేశ్‌కి జగనే ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే పుస్తకాన్ని శుక్రవారం గడప గడపకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లుగా ఎన్నడూ చూడని అభివృద్ధి, సంక్షేమం అమలవుతుందని ప్రజలే అభిప్రాయపడుతున్నారని అన్నారు. మాటతప్పని నేతగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల మనసులో స్థానం సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ అరవా ఆదిలక్ష్మీ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గోపు పద్మావతి అంజిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

న్యుమోనియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కొత్త రామకృష్ణ, డాక్టర్ గీతాంజలి, తదితరులు

సత్తెనపల్లి: చిన్నపిల్లల్లో న్యుమోనియా లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించటం వల్ల ప్రాణాలు కాపాడవచ్చు అని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో న్యుమోనియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిన్నపిల్లలు న్యుమోనియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పిల్లల వార్డులో, ప్రసూతి విభాగాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల అందరికి అవగాహన ఏర్పడి జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి గీతాంజలి మాట్లాడుతూ ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ హాస్పిటల్‌లో చిన్న పిల్లలు, గర్భిణులకు అవగాహన కల్పించడం వల్ల వ్యాధిని ఆదిలోనే అరికట్టవచ్చన్నారు. హాస్పిటల్ మొత్తం తిరిగి చూసి హాస్పిటల్ ఎంతో అభివృద్ధి చెందిందని పారిశుద్ధ్య నిర్వహణ కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిలో ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఆర్ఎంఓ శోభారాణి, పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ నాగ పద్మజ, డాక్టర్ అనూష, గైనకాలజిస్ట్ సుజాత, పిల్లల డాక్టర్ ప్రేమ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్ నర్స్ వెంకటేశ్వరమ్మ, సిబ్బంది ఉన్నారు.

వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్తు సోపానాలు



మాదల(ముప్పాళ్ళ): వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్తుకు ఉపాధి సోపానాలు అని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు పీ రమేష్ తెలిపారు. మండలంలోని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వృత్తి విద్యలో భాగంగా 9, 10వ తరగతి విద్యార్థినులు వెర్నెట్‌స్కిల్స్ ఆధ్వర్యంలో దూళిపాళ్ళలోని రాయని స్పిన్‌టెక్స్ మిల్లుకు ఇండస్ట్రియల్ విజిట్ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మిల్లులో దారం తయారీ, మిషనరీ గురించి నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిల్లు జనరల్ మేనేజర్ వి.ఆనంద్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వృత్తివిద్యా టీచర్స్ వి.రామాంజనేయులు, కేడీఎల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో స్పటిక శివలింగం గ్రామోత్సవం

రెంటచింతల: సత్రశాల వద్ద పవిత్ర కృష్ణానది తీరాన వేంచేసియున్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోని అభిషేక మండపంలో పవిత్రమైన స్పటిక లింగాన్ని ఈ కార్తీకమాసంలో ఏర్పాటు చేయనున్నట్లు సత్రశాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌లోని జైపూర్‌లో రూ.2.80 లక్షల వ్యయంతో ఈ స్పటిక లింగం తయారు చేయించి రెంటచింతల గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్తీక పౌర్ణమి రోజు భక్తులను స్పటిక శివలింగం దర్శనం చేసుకోవడానికి అనుమతించడం జరుగుతందన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ దీప్తి



పాఠశాల విద్యార్థులచేత ఐరన్ టాబ్లెట్స్ మింగిస్తున్న డాక్టర్ దీప్తి

అచ్చంపేట: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ దీప్తి తెలిపారు. మండలంలోని తాళ్లచెరువు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆమె గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. బాలింతల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆర్‌సీఎం ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులచేత ఐరన్ టాబ్లెట్స్ మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు గర్భందాల్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యశాలలో ప్రసవించడం ఆరోగ్యకరమని సూచించారు. ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా పరీక్షలు నిర్వహించి రక్తహీనత గలవారికి టాబ్లెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సుశీల, పాఠశాల హెచ్ఎం తుమ్మా శౌరైడ్డి, అంగన్‌వాడీ టీచర్ మరియకుమారి, ఆశా వర్కర్ మరియరాణి, ఉపాధ్యాయురాలు జోజమ్మ పాల్గొన్నారు.

ఘనంగా నాగులచవితి వేడుకలు



నర్శింగపాడులోని కాశీవిశ్వేశ్వరాలయంలో నాగేంద్రుని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నకరికల్లు: మండలంలోని పలుగ్రామాల్లో మహిళాభక్తులు నాగులచవితి వేడుకలను శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నకరికల్లులోని లక్ష్మీనర్సింహస్వామి కొండ వద్ద గల పుట్టకు, అడ్డరోడ్డులోని పోలేరమ్మతల్లి అమ్మవారి ఆలయం సమీపంలోని పుట్టకు, నర్శింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో గల పుట్టకు మహిళాభక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నర్శింగపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుని విగ్రహానికి అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే సహించం

ఏవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి



తనిఖీ నిర్వహిస్తున్న ఏవో శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్ల: నకిలీ ఎరువులను రైతులకు విక్రయిస్తే సహించేది లేదని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణ, మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని, అది కూడా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎరువులను విక్రయించాలని సూచించారు. రైతులకు కొనుగోలు రసీదు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే సహించమని అన్నారు. అనంతరం పలు దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కారుమంచిలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు



కారుమంచి మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ ప్రమీల

శావల్యాపురం: మండలంలోని కారుమంచి ప్రభుత్వ మద్యం దుకాణంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన షాపులో అమ్మిన మద్యం సీసాలకు సంబంధించిన చలానా ఈ నెల16వ తేదీ మధ్యాహ్నానికి చెల్లించకపోవటంతో అనుమానం వచ్చి మద్యం దుకాణాన్ని తనిఖీ చేయించినట్లు ఎక్సైజ్ సీఐ మున్నంగి ప్రమీల వెల్లడించారు. అయితే సూపర్‌వైజరు లేకపోవటంతో పాటు మద్యం సీసాల నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించామనీ, దుకాణంలో 32,150 సీసాలు ఉండాల్సి ఉండగా 28 వేల 650 సీసాలు మాత్రమే ఉన్నట్లు తనిఖీల్లో నిర్ధారణ అయిందన్నారు. మిగిలిన సీసాలను బార్ కోడ్ లేకుండా అక్రమంగా అమ్మినట్లు గుర్తించామని వీటి విలువ రూ. 5 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. అయితే సూపర్‌వైజరు కుటుంబ సభ్యులు కొంతమేర జమ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీలు చేసిన వారిలో ఎక్సైజ్ ఎస్ఐ రంగిసెట్టి పూర్ణచంద్రరావు, సిబ్బంది మల్లావరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

పిడుగురాళ్ల: అనారోగ్య సమస్యలతో పట్టణంలోని 10వ వార్డుకు చెందిన పఠాన్ కరిముల్లా (47) మృతి చెందటంతో మృతుని భార్య రసూల్‌బీకి వైఎస్సార్ బీమా నగదును అందజేశారు. కార్‌పెయింట్ వర్క్ చేస్తూ జీవనం సాగించే పఠాన్ కరిముల్లా గత కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో రసూల్‌బీకి మట్టిఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును 10వ వార్డు కౌన్సిలర్ షేక్ అబ్దుల్లా చేతుల మీదుగా అందజేశారు.

గ్రంథాలయాలు జ్ఞానానికి ఆలయాలు

విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



క్రోసూరు గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

పెదకూరపాడు : 56వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు పురస్కరించుకుని పెదకూరపాడులోని డాక్టర్ వైఎస్సార్ శాఖ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి కె.మురళి శుక్రవారం తెలిపారు. విజేతలకు ఈ నెల 21న జెడ్పీ పాఠశాలలో నిర్వహించే వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలలో చిత్రలేఖన పోటీలు

క్రోసూరు: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలిపారు. జూనియర్స్ జలసంరక్షణపై చిత్రాలు వేయగా, సీనియర్స్ స్వాతంత్ర్యపోరాట యోధుల చిత్రాలు వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు షేక్ సిలార్ష, షణ్ముఖరెడ్డి, పి.శ్రీనివాసరావు విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత, వాటి వల్ల ప్రయోజనాలు తెలియజేసారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, శ్రీ సరస్వతి శిశు మందిర్, సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భవిష్య పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



సెమలిపురి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు దిశ చట్టంపై అవగాహన కల్పిస్తున్న సత్తెనపల్లి సీఐ

రాజుపాలెం: ఎక్కువగా సెల్‌ఫోన్‌లు వాడొద్దని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సత్తెనపల్లి సీఐ ప్రేమయ్య తెలిపారు. మండలంలోని జిల్లా పరిసత్ పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు సెల్‌ఫోన్‌ల వాడకం, దిశ చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. సెల్‌ఫోన్‌లు ఎక్కువగా వాడడం వలన కళ్లజబ్బులు, చెడు అలవాట్లు అలవడుతాయని తెలిపారు. దిశ యాప్‌ను ప్రతీ ఒక్కరు మీ తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మీరు ఆపదలో ఉన్నప్పుడు 100కు ఫోన్ చేసినట్లయితే క్షణాలలో మీరు ఉన్న చోటుకు పోలీసులు వస్తారని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం డి.నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ



పడిపూజ కోసం నకరికల్లులో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మండపం



పడిపూజలో భజన చేస్తున్న అయ్యప్పమాలధారణ భక్తులు

నకరికల్లు: స్థానిక కొండయ్యగుడి వద్ద అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళాకారులచే ప్రత్యేకంగా రూపొందించిన అయ్యప్పస్వామి మండపం వద్ద గురువారం రాత్రి భజనా కార్యక్రమం చేపట్టారు. అర్చకులు కొడవటిగంటి పాండురంగాచార్యులు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి వారిని విశేషంగా అలంకరించారు. మండపం మెట్ల దీపాలు వెలిగించి పూజలు చేశారు. భజన బృందం వారిచే అయ్యప్ప కీర్తనల ఆలాపన భక్తులను భక్తిపారవశ్యంలో ముంచేసింది. రాత్రి 1గంట వరకు భజన నిర్వహించి అనంతరం అయ్యప్పమాలధారులు భిక్ష చేశారు.

బాలల సంరక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి

- ఎంపీపీ పి.కోటయ్య
- గుడ్‌షెపర్డ్స్ కాన్వెంట్స్ ఆధ్వర్యంలో మండల అధికారులతో సమావేశం



బాలల హక్కుల సంరక్షణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



రెంటపాళ్లలో అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎమ్ బాలరాజు, పక్కన మేడే వెంకటరమణ

క్రోసూరు: బాలల సంరక్షణ యంత్రాంగాన్ని మండల అధికారుల పర్యవేక్షణలో బలోపేతం చేయాలని ఎంపీపీ పి.కోటయ్య అన్నారు. అమరావతి, గుడ్‌షెపర్డ్స్ కాన్వెంట్స్ ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీపీ మాట్లాడారు. బాలల హక్కులు కాపాడి బాల్యవివాహాలు అరికట్టాలి, బాలలు బాలకార్మికుల వ్యవస్థలోకి వెళ్లకుండా పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సిస్టర్ సుపీరియర్ విన్నరసి మాట్లాడుతూ మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో బాలల హక్కులు కాపాడాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి లత మాట్లాడుతూ బాల్యవివాహాలు కొంత మేర తగ్గుముఖం పట్టాయాని, గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని చెబుతున్నప్పటికీ కొందరు రహస్యంగా చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. అనంతరం బాలలహక్కుల పరిరక్షణ పోస్టర్లు ఆవిష్కరించారు. బాబారావు, బ్యూలా, బత్తుల బాబు, ఏఎస్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి ఖాజావలి, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, గౌస్ పాల్గొన్నారు.

విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదగాలి

రాజుపాలెం: విద్యార్థులందరు మంచిగా చదువుకుని భావిభారత పౌరులుగా ఎదగాలని తల్లిదండ్రులకు, గురువులకు సమాజంలో మంచి పేరు తేవాలని హెచ్‌ఎం అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని ఇనిమెట్ల జెడ్పీ పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, విద్యా, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అంతం చేద్దాం

సత్తెనపల్లి: బాల్యవివాహాలు అంతం చేద్దామని సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.బసవరాజు అన్నారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై గ్రామంలో శుక్రవారం అవగాహన కల్పించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహించారు. బసవరాజు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాల లోపు పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మహిళా పోలీస్ మధులత మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకొని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యానిమేటర్ పి.ప్రసన్న, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న యూటీఎఫ్ పల్నాడు జిల్లా 2వ కౌన్సిల్ సమావేశాలు



వినుకొండ(నూజెండ్ల): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పల్నాడు జిల్లా 2వ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 26వ తేదీన గురజాల చల్లగుండ్ల గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి. ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు ఎం.రవిబాబు, ఆర్. అజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం. పోలయ్య, జి.నాగరాజు, ఐదు మండలాల నాయకులు బి.భాస్కరరావు, వి.నాగేశ్వరరావు, డి.రవికుమార్, పి.రమేష్‌బాబు, పీఏ జిలానీ, బి.రామునాయక్, డి.మస్తాన్, సీహెచ్. మల్లికార్జున, డి.కోటేశ్వరరావు, ఐ.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.